ఓం నమో భగవతే శ్రీరమణాయ భారతీ దేవ్యైనమః

ఉమాసహస్రము

(తొమ్మిదవ శతకమున – తృతీయ స్తబకము)

పంచత్రింశస్తబకము

అవ:- ఈ ముప్పదియైదవ స్తబకమున – ఏతత్కవి – భగవతీ కటాక్షమును ప్రార్థించుచు, తత్ ప్రభావ సంకీర్తనము చేత నాయమ్మయందు గల భక్తిని పోషించుచున్నాఁడు.

ఈ స్తబకము శక్వరీప్రస్తారగతమగు ఇందువదనావృత్తము చేత నిబంధింపఁబడినది.

మూ॥ అన్ధతమసం శశివిభామభిదధానా
కాన్తిమలమాస్య కమలస్య విదధానా
అన్ధకవిరోధిదయి తాస్మితలవ శ్రీ
ర్బాతుభువనస్య సకలస్య కుశలాయ 1

చంద్రప్రభను గాఢాంధకారమని చెప్పునదియు, ముఖపద్మము నలంకరించునదియు, అగు అంధకరిపునిదయితయగు పార్వతి యొక్క హాసలేశశోభ – సకలప్రపంచము యొక్కయు క్షేమమునకై, వెలయుఁగాత!

ప్రభ:- '' అయమ్మ మందహాసశ్రీ యెదుట, చంద్రుఁడు – కారుచీఁకటిగాఁ జేయఁబడుచున్నాడు, ఆహాసలవశోభ – ముఖపద్మకాంతికి భూషణముగాఁ జేయుబడుచున్నది'' అని చెప్పుట వలన – ''చంద్రునకును, ముఖ కాంతికిని గూడ– మూలమగు తేజము – ''దేవీ స్మితలవ శ్రీ' యే యగును'' అనునంశము – ధ్వనింపఁజేయఁబడుచున్నది.

మూ॥ బాహివివిధాకృతిమతీ ద్విజసమూహే
పాహిగతిహీనమఖిలేశ్వరి! కులంనః
దేహి బహు కాలభజకాయపరమేతం
యాహి నగనన్దిని! యశః శశివలక్షమ్. 2

అఖిలేశ్వరివగు నగనందినీ! (పర్వతపుత్రీ!) జననము చేతను, ఉపనయనాది సంస్కారము చేతను, జన్మద్వయము గల ద్విజుల యొక్క సమాజమునందు – నానాప్రకారమగు ప్రయత్నము గలదానవై భాసింపుము. ఉపాయహీనమగు మా (మానవ) కులమును రక్షింపుము. బహుకాలము నుండియు భక్తుఁడనగు నాకీవరమునిమ్ము. శశివలక్షమగు (చంద్రుని వలెన ధవలమగు) యశమును బొందుము.

ప్రభ:- బ్రాహ్మణకోటియందు నీవు భాసించుట వలన భారతకులమునకంతకును శ్రేయమగును. గతిహీనమగు మా మానవకులమునకు రక్షాదానమును ప్రార్థించుచున్నాను. 'ఆవరదానము చేత – నీయశము శుభ్రమగును' అని భావము.

మూ॥ వారయతి ఘోరతరపాతక సమూహం
వర్ధయతి ధర్మమపి శర్మకరమస్తే
కిఙ్కరజనస్య న కిమావహతి భవ్యం
శఙ్కరపునన్ధ్రి! తవ పాదపరిచర్యా! 3

శివ మహిషీ! భవత్ పదశుశ్రూష – ఘోరతరమగు పాప సమూహమును నివారించును. పరిణామకాలమున శర్మకరమగు (సుఖకరమగు) కర్మమును గూడ పోషించును. కింకరజనులకది సంఘటింపని కుశలములుండవు.

ప్రభ:- ఇచట ధర్మమనఁగా; సత్పురుషుల యాచారమే యగును.

మూ॥ యస్య మనుజస్య హృదయేఽస్తిసదయే!తే
నాక చరసేవ్యమయి పాదసరసీజమ్।
తం భజతి పద్మముఖి ! పద్మవనవాసా
లాభభవనే భవతు నామరపురోధాః. 4

కారుణ్యవతివగు జననీ! స్వర్లోకసంచారులగు దేవతల చేత పూజింపఁబడు నీ పాదపద్మము - ఏమనుష్యుని హృదయమునందుండునో, వానికి లాభ స్థానమునందు (లక్ష్మీప్రాప్తిస్థలమునందు) దేవపురోహితుఁడగు బృహస్పతి లేకుండినను గూడ - పద్మాలయయగు శ్రీదేవి వాని నాశ్రయించును.

ప్రభ:- జ్యోతిశ్శాస్త్రమునందు లగ్నము నుండి పదునొకండవదగు స్థానము - లాభస్థానమని చెప్పఁబడును. దేవీభక్తుని లాభస్థానము నందు, గురుఁడు- లేకున్నను, వానికి లాభప్రాప్తి కలుగునని భావము.

(గణపతి మునీంద్రుని జ్యోతిష విద్యావేదనము సుప్రసిద్ధము!)

మూ॥ యద్యఖిల మౌనిగణ గీతగుణజాలం
కాలభయహారి కరుణారసమరన్దమ్।
అద్రితనయాఙ్ఘ్రిజల జన్మహృదయేస్యా
దష్టమగతోఽపి విదధాతురవిజః కిమ్॥ 5

మౌనులందఱిచేతను కొనియాడఁబడిన గుణసమూహము గలదియు, మృత్యుభయమును తొలగించు కరుణారస మకరందము గలదియు, అగు పార్వతీ పాదపంకజము - హృదయము నందున్నయెడల, శని - జన్మరాశినుండి యష్టమస్థానము నొందినను గూడ శోకమును గూర్పఁజాలఁడు.

ప్రభ:- ''చారవశము వలన చంద్రరాశినుండి యష్టమమగు స్థానము నొందిన శని - అనేకములగు నశుభములనిచ్చును'' అనునది జ్యోతిష ప్రసిద్ధము.

హృదయస్థమగు దేవీ చరణము - గ్రహగతి వీర్యమును గూడ- (గ్రహచారమును గూడ) జయించుటకు సమర్థమగును'' అని భావము.

మూ॥ లేఖలలనాక చసుమైః కృతబలింతే
యోభజతి పాదఘృణిమాలినమనస్తే
నిస్తరతి నూనమయమస్త మితమోహః
శోక తిమిరం సకలలోక గణమాతః॥ 6

సర్వలోక గణజననీ! దేవాంగనల శిరోజాలంకార పుష్పముల చేత పూజింపబడిన నీ పాద సూర్యుని భజించు భక్తుఁడు - అస్తమిత మోహుఁడై, శోకమను తిమిరమును తొలఁగించుకొనును. సత్యము!

ప్రభ:- పాదము - సూర్యుడుగాను, శోకము - చీకటిగాను, ఆరోపింపఁబడుట వలన ఇది రూపకమగుచున్నది.

మూ॥ శీతకరదర్పహర వక్త్రజలజాతే
శీతగిరినన్దిని! తవాఙ్ఘ్రిజలజాతమ్।
యః స్మరతి దేవి! హృదివిస్మరతిసోఽయం
విష్టపమశేష మపి కష్టతతిముక్తః॥ 7

శీతకిరణుని గర్వమునడఁచుచున్న ముఖపద్మము గల పార్వతీ! నీ పాద పద్మమును హృదయమునందు ధ్యానించు భక్తుఁడు - కష్టసంతతి నుండి విముక్తుఁడై, సమస్తలోకమును గూడ - విస్మరించును.

ప్రభ:- పాదధ్యానము వలన జనించిన ఆనంద పారవశ్యము వలన - జగద్విస్మృతి కలగుచున్నది. కాని, నిద్రామదాదిపారవశ్యము వలనఁగాదు. కేవలమగు నిద్రాదులయందు - కష్టాదులకు విస్మృతి మాత్రమే కలుగును. కాని, యది - విముక్తి కానేరదు.

మూ॥ సక్తిరయి యస్యతవ పాదసరసీ జే
శక్తిధరమాత రనలాక్ష గృహనాథే!
పూర్ణశశిజైత్రముఖి! పుణ్యపురుషోఽసౌ
స్వర్ణశిఖరీవ బుధలోక శరణం స్యాత్॥ 8

శక్తిధర (సుబ్రహ్మణ్య) మాతవును, పూర్ణశశిజైత్రవదనవును, అగు అనలాక్షగృహిణీ! ఎవనికి నీచరణకమలమునందాసక్తి యుండునో, ఆయా పుణ్యపురుషుఁడు – స్వర్ణగిరి (మేరు పర్వతము) వలె బుధలోకమునకు (విద్వజ్జనులకు – లేక దేవతలకు) శరణము (రక్షకుఁడు, లేక – గృహము) అగుచుండును.

ప్రభ:- ''శక్తిని ధరించిన, కుమారస్వామికి నీవు మాతవు! అతఁడు తారకుని జయించెను. నీ ముఖము – తార కాధిపుఁడగు పూర్ణచంద్రుని జయించినది!. మూడవదియగు అగ్ని నేత్రముగల హరునికి నీవు గృహిణివి! అతఁడు మన్మథుని జయించెను. నీవతననినే జయించితివి ఇట్లు నీ పుత్రునియందును, నీ ముఖమునందును, నీ భర్తయందును, విజయశక్తి యోగమున్నది. కనుక – నీచరణము నాశ్రయించిన పుణ్యపురుషుఁడు గూడ – శక్తియుక్తుఁడై – మేరుపర్వతము – విబుధులగు దేవతలకు శరణము (ఆశ్రయము) అగునట్లు, విబుధులగు (పండితులగు) జనులకు రక్షకుఁడగుట – వింత కాదు'' అని భావము. సాభిప్రాయ విశేషణములు గలది యగుట నిందున్నది – 'పరికరము' అను నలంకారమగును. విశేష్యము గూడ – సాభిప్రాయమైయున్నది. కనుక, ఇది – పరికరాంకురము కూడ నగును.

మూ॥ వైరిగణ నిర్దలన ఖడ్గవరపాణే!
వాససి పదోర్ధ శనవాససి చ శోణే!
నేత్రమిషపావక విశేషిత లలాటే!
పాపమఖిలం జహిమృగాధిపతిఘోటే.! 9

శత్రుసవమూహచ్ఛేదన ఖడ్గహస్తవును, వసనమునందును, చరణములందును, దశనవాససునందును (అధరమునందును) రక్తవర్ణము గలదానవును, నేత్రమనుమిషగల యగ్నిచేత విభూషితమగు లలాటము గలదానవును, సింహవాహనవును, అగుజననీ! నా పాపము నంతను ఛేదింపుము.

ప్రభ:- మాతా! శ్రేష్ఠమగు హస్తము చేత – నీవు శత్రువులను ఛేదింతువు రక్తాంబరవు, అరుణచరణవు, బింబాధరవు, నయియుందువు, అగ్నినేత్రుఁడగు శివునికి పత్నివగుట వలన నీకుఁగూడ నాయగ్నియే నేత్రమగుచుండును. నీగుఱ్ఱము, సింహము. '' ఇట్టినీవు సకల పాపములను సంహరించి నన్ను రక్షింపుము''. అని భావము.

మూ॥ వేదచయ వేదిజనవాద విషయస్య
ప్రతియుత లోకతతి శోకశమనస్య
వేతనవివర్జితభటోఽయమహమక్షేః
శీతకరపోతధర పుణ్యవనితే! తే॥ 10

బాలచంద్రుని ధరించిన శివుని పుణ్యాంగనవగు జననీ! సకల వేదములను తెలిసిన పండితుల వాక్యములకు విషయభూతవమును, (ఉద్దేశముగా జేయఁబడినదియు,) భక్తి యుక్తమగు లోకబృందమునందున్న శోకమును తొలగించునదియు, అగు నీ చరణమునకు – నేను జీతము లేని సేవకుఁడనై యున్నాను.

మూ॥ కార్యమయి మే కిమపి కార్యపటుబుద్ధేః
పాదసరసీజయుగలీ పరిజనస్య
అమ్బ! వద జమ్బరిపుగీతగుణజాలే!
శుమ్భకులనాశకరి! శమ్భుకులయోషే! 11

జంభరిపుఁడగు నింద్రునిచేత కీర్తింపఁబడిన గుణజాలము గలదానవును, శుంభాసురుని విధ్వంసము నొనర్చినదానవును, శివకులాంగనవును, అగు జననీ! చేయఁదగిన కార్యమున నిపుణమగు బుద్ధిగలవాఁడను, పాదకమలయుగళీ పరిచారకుఁడను, అగు నేనొనర్పఁదగిన కార్యమును వచింపుము.

మూ॥ త్వం యది శిలావదయి నోవదసి కృత్యం
నాస్తి తవరాజ్య పటుబుద్ధిరితి సత్యమ్।
ఆదిశ యథార్హకరణీయకృతినిత్యం
రాజ్ఞి! భువనస్య చరణామ్బురుహభృత్యమ్॥ 12

ప్రపంచరాజ్ఞివగు జననీ! నీవు శిలవలె, నేనొనర్పఁదగిన పనిని తెలుపకుండిన యెడల, నీకు రాజ్యము నందు సమర్థమగు బుద్ధి లేదనుట సత్యమగును. యోగ్యములగు కరణీయములయందు స్థిరుఁడనగు నీ చరణాంబుజభృత్యు నాజ్ఞాపింపుము.

ప్రభ:- నీవు నాకు కర్తవ్యమును బోధింపని యెడల, నీవు భువనరాజ్ఞివని ప్రసిద్ధవైనను, నీకు రాజ్యకౌశలము లేదని చెప్పవలయును. కావున నీవు నాకుచితమగు కర్తవ్యమును బోధింపుమని భావము.

మూ॥ పఞ్చసు విహాయ మనసః కిమపి సఙ్గం
పుత్రజన మిత్రజన బాన్ధవ వధూషు।
ఏష భజతే జనని! పాదజలజంతే
పాలయను ముఞ్చను తవోపరి స భారః॥ 13

జననీ! పుత్రుఁడు - ధనము - మిత్రుఁడు - బంధువు - భార్య - అను నైదింటియందును, ఉచితమగు సంగమును విడిచి, యీ మనుష్యుఁడు - నీ పదపద్మమును సేవించుచున్నాఁడు. పాలింపుము, లేక త్యజింపుము. నీయందు భారమునుంచితిని.

ప్రభ:- పుత్రాదులయందు సంగమును విడచి, నీయందే భారము నుంచి యున్నాను. ఇకమీద నీవే ప్రమాణము.

మూ॥ వజ్రధరముఖ్య సురసఙ్ఘయ కిరీట
స్థాపితమహార్ఘమణి రఞ్జితనఖాయ
జీవితమదాయి జగదీశ్వరి! మదీయం
పాదజలజాయ తవ పాలయనుమావా॥ 14

జగదీశ్వరీ! వజ్రధరుఁడగు నింద్రుఁడు మున్నగు దేవతల సమూహము యొక్క కిరీటముల యందు స్థాపింపఁబడిన మహార్ఘములగు (అధిక మూల్యములగు) మణులచేత - రంజితములగునఖములుగల నీపదారవిందమునకు నాజీవితమును సమర్పించుచున్నాను. రక్షించెదవో, విడిచెదవో.

మూ॥ దేహి జగదీశ్వరి! నవా మదభిలాషం
పాహి కరుణావతి! న వాకుల మిదం నః
శూలధరకామిని! సురాసుర నిషేవ్యం
పాదకమలం తవపరే నవిజహామి. 15

జగదీశ్వరీ! నాయభిలాషము నిచ్చెదవో, లేదో, కరుణావతీ! మా భారతీయకులమును రక్షింతువో, రక్షింపవో, శూలధర కామినీ! జగదంబా! దేవాసుర సేవ్యమగు నీపాదకమలమును మాత్రము విడువను.

మూ॥ పాసికిల పాదయుగకిఙ్కర సమూహం
హంసికిలపాపతతి మాపధినుతాత్వామ్
దన్తివదన ప్రసు? వదన్తి మతిమన్తో
నాన్సృతమిదం భవతు, నాకిజనవన్ద్యే॥ 16

పాదయుగ భక్తులగు లోకులను రక్షింతువట! ఆపద సంభవించునపుడు నుతింపఁబడిన నీవు పాపసమూహమును ధ్వంసమొనర్చెదవట! గజముఖజననీ! బుద్ధిమంతులిట్లు చెప్పుచున్నారు. స్వర్గవాసుల చేత స్తుతింపఁదగిన జననీ! ఇది యసత్యము గాకుండుఁగాత!

మూ॥ శక్రముఖ దేవతతివన్దిత విస్పష్టే!
వక్రఘన కేశి! చరణే తవ లుఠన్తమ్
ఆపది నిమగ్న మిమ మాశ్రితమనాథమ్,
నన్దిహయసున్దరి! నపాలయసి కేన. 17

కుటిలమును, మేఘశ్యామలమును, అగు కేశపాశము గల నందివాహన సుందరీ! ఇంద్రాది దేవ బృందము చేత వందితమును, విస్పష్టమును, (ముక్తమును) అగు నీపాదమునందు సంశ్లేషము నొందిన వాఁడను, దురవస్థయందు నిమగ్నుఁడను, నిన్నాశ్రయించినవాఁడను, అనాథుఁడను, అగు ఈ నన్ను – నీవే హేతువువలన రక్షింపకున్నావు?

మూ॥ ఘోషమయమమ్బ విదధాతి పదలగ్నో
నావసి పురాణి కిము నారి బధిరాసి!
వన్ది సురబృన్ద నుతి భాషితహృతం వా
కర్ణయుగలం తవ కపాలికులయోషే!. 18

అమ్మా! భవత్పదలగ్నుఁడనగు నేను ఘోషపెట్టుచున్నాను. (ఆక్రందించుచున్నాను) పురాతననారీ! నన్నురక్షింపకున్నావు. చెవిటిదానవా? యేమి! కపాలికులగృహిణీ! లేక, స్తుతిపాఠకులగు దేవ బృందముల యొక్క స్తోత్రవచనముల చేత నీకర్ణయుగలము– అపహరింపఁబడినదా?

ప్రభ:- నా యాక్రందన ఘోష నాలకింపకుండుటకు కారణమేమి? బాధిర్యమా? లేక సురబృందస్తోత్రమున నీ చిత్తమేకాగ్రమయినదా?

మూ॥ అమ్బ! భవ బిమ్బ ఫలకల్ప రదచేలే!
శమ్బరరిపుత్నబలకారి బహులీలే!
ప్రాగమృతభాను ముకుటస్య మదయిత్రీ
తం కురుతతః పరమురీకృత మదర్థమ్॥ 19

బింబఫలకల్పమగు నధరము గలదానవును, శంబరరిపుఁడగు మన్మథునకు బలకారులగు బహులీలలు గల దానవును అగు జననీ! మొదట చంద్రచూడుఁడగు శివునికి హర్షమును గలిగింపుము. తరువాత నా పరమేశ్వరుఁడు నా విషయము నంగీకరించునట్లు చేయుము.

ప్రభ:- శివుని హర్షింపఁజేయుటకు నీవే సమర్థురాలవు. కావున మొదట పతిని మదింపఁజేసి – తదుపరి నా ప్రస్తావనము నొనరింపుము.

మూ॥ నిర్మల సుధాకర కలాకలితమస్తే!
ధర్మరతపాలిని! దయావతి! నమస్తే
ఏతమవదేవి! చరణామ్బురుహబన్ధుం
శీతధరణీధరసుతే! గమయనాన్ధమ్॥ 20

నిర్మలమగు చంద్రకళ చేత నలంకరింపఁబడిన శిరస్సు గలదానవును, ధర్మాసక్తులను రక్షించుదానవును, అగు దయావతీ! నీకు నమస్కారము. దేవీ! చరణాంబురుహబంధుఁడగు, నీ భక్తుని రక్షింపుము. హైమవతీ! నన్ను సంసారకూపమున బడద్రోయకుము.

ప్రభ:- నాకధోగతి నీయకుమని భావము.

మూ॥ అద్రికులపాలక కుల ధ్వజపతాకే!
భద్రగజగామిని! దరిద్రమయి మత్వా
క్షుద్రమివశోచ్యమిమ మర్థి జలజాక్షం
రుద్రదయితే! జనని! పాహినజహీహి॥ 21

అద్రికులేశ్వర ధ్వజపతాకవును, భద్రగజగమనవును, అగు జననీ! బుద్ధి దారిద్ర్యము గలవాఁడను, జాలినొందఁదగిన వాడను, అగు నీ నన్ను పాలింపుము. రుద్రదయితా! నీచుని విడుచునట్లు నన్ను విడువకుము.

మూ॥ అస్తు తవ పాదకమలే స్థితి రజస్రం
నాఽస్తి పరదుఃఖ విషే హృదితుశాన్తిః
అస్తుకరుణోమయమస్తు మతిలోపః
కష్టమిదమమ్బ! మమభూరి పరిశిష్టమ్॥ **22**

అమ్మా! నేనెల్లప్పుడును నీ పాదకమలమున స్థితిగలవాఁడనగుదను గాక! అస్మాదృశులగు నితరులదుఃఖములయందగు సహానుభూతి చేత – పరవశమగు నా హృదయమునందు మాత్రము నాకు శాంతి లేకున్నది. పరదుఃఖపారవశ్య జననియగు, ఇది – కరుణయగుఁగాక. (లేక) బుద్ధిలోపమగుఁగాక. నాకీయమితమగు కష్టము – పరిశిష్టము. (మిగిలియున్నది).

ప్రభ:- ''కరుణ మతిలోపము, అంతమునందవశిష్టమగు కష్టము, అనునవి యుండుఁగాక! నా హృదయమున శాంతి లేకుండుట వలన – దానిని నీ పదపద్మమున నిలుపఁగోరుచున్నాను''. ఈ మహాశయుని – పరదుఃఖదుఃఖితత్వము – దీనియందు స్ఫుటమగుచున్నది. '' ఇది – కరుణ గాని, బుద్ధిలోపము గాని, ఏదయినను, లోకుల దుఃఖములు శాంతి నొందువఱకును నాహృదయమునకు శాంతిలేదు. అశాంతమైన నా హృదయము – నీ పదమునందెట్లు నిలుచును? దాని నీవే – పదములందు నిలుపుకో'' అని ప్రార్థింపఁబడినది. లోకోపకారపరాయణుల ప్రార్థనమిట్లే యుండును గదా!

మూ॥ దుఃఖసుఖ భేదరహితానమతి రాసీత్
సాధుఖల భేదరహితా నమతి రాసీత్
భాగ్యమతి మాన్యమథవా మమ త దేత
న్మాతరిహసఙ్ఘభజనేయదవకాశః **23**

మాతా! నాకు సుఖ – దుఃఖభేదవర్జితమగు బుద్ధి – లేకున్నది. అట్లే, సజ్జన దుర్జన భేదరహితమగు బుద్ధికూడ లేకున్నది. (శాస్త్రములు సమబుద్ధి నుపదేశించుచున్నవి. నాకు తదుపదిష్టమగు సమబుద్ధి లేకున్నది) ఇది దోషమేయయినను, సంఘ సేవనమునందు నాకవకాశము కలుగుచున్నది. కావున, నాకిది – (ఈ భేద బుద్ధి) మిక్కిలి పూజ్యమగు భాగ్యమై యున్నది.

ప్రభ:- అనుకూలమగు ననుభవమునందును, ప్రతికూలమగు ననుభవము నందును, గూడ జ్ఞానులకు భేదబుద్ధియుండదు. అదియే శ్రేష్ఠమగు సమబుద్ధి యని శాస్త్రములుగ్ఘడించుచున్నవి. కాని, సుఖ – ధుఃఖ, సాధు – ఖలభేదబుద్ధి లేని యెడల సంఘసేవ కవకాశముండదు. ఇట్టి సమత్వ బుద్ధి నాకు లేకుండుట వలననే సంఘసేవనొనర్పఁగలుగుచున్నాను. 'కావున నిది నాకు భాగ్యమే యగుచున్న' దని భావము.

విశే:- భేదబుద్ధిని భాగ్యమని సమర్థించుట దుష్కరము. సంఘభజ నావకాశ లాభరూపమగు వాక్యార్థముచే నది సమర్థింపఁబడినది. కావున నిది – కావ్యలింగాలంకారమగుచున్నది.

మూ॥ అస్తు మమ భేదమతి రస్తు మమ పక్షో
యత్నపరతాఽస్తు మమ మాఽస్తు చ విమోక్షః
మోక్షమయి వేద్మి కులకష్టతతిమోక్షం
ప్రేషయసకృత్ తవ మహేశ్వరి ! కటాక్షమ్. **24**

నాకు భేదబుద్ధి – (సజ్జన – దుర్జనాదుల యందగు భిన్న భావము) ఉండనిమ్ము. (సాధనయోగ్యార్థ రూపమగు) సాధ్యరూపమగు పక్షము – ఉండనిమ్ము. యత్నపరత (ఉద్యోగము) ఉండనిమ్ము. మోక్షము (జన్మబంధము నుండి విడుదల) లేకపోనిమ్ము. జననీ! మహేశ్వరీ! భారతీయ కులకష్ట సంతతి యొక్క మోక్షమునే – నేను మోక్షమని తెలిసికొనుచున్నాను, కావున నీ కటాక్షము నొకసారి పంపుము.

ప్రభ:- ఈ శుభోదయుఁడు – లోకకష్టమును నివర్తించుటయందత్యాసక్తుఁడై యిట్లనుచున్నాఁడు. నీ కటాక్ష ప్రసారము వలన – భారతీయు కులకష్ట నివృత్తి రూపమగు మోక్షము నొందగలనని భావము.

మూ॥ శాక్వరగణేనముఖరేఽత్రగణనాథే
విష్ణుయశసీశవధు! జిష్ణుముఖవన్ద్యే!
అమ్బ! కరుణాంకురు శివఙ్కరి! నిరఙ్క-
స్వచ్ఛ కిరణార్భక విభూషిత లలాటే! 25

విష్ణు ప్రముఖ దేవవంద్యవగు ఈశ్వరపురంధ్రీ! మచ్చలేని బాల చంద్రుని చేత నలంకరింపబడిన లలాటము గలదానవును, క్షేమము నొసఁగుదానవును, అగు జననీ! చతుర్థశాక్షరయుక్తమగు శక్వరీ ఛందము నుండి జనించిన శాక్వర గణము చేత శబ్దించుచున్నవాఁడును, విష్ణునియశస్సు వంటి యశస్సుగలవాఁడును, అగు, ఈ గణపతియందు కరుణనుంచుము.

ప్రభ:- ''శుక్లాంభరధరం విష్ణుమ్'' అను ప్రసిద్ధ శ్లోకమునందలి విష్ణుపదము విభుత్వరూపమగు నర్థమును దెలుపుచు, విఘ్నేశ్వరునికి వాచకమగుచున్నది. కావున విఘ్నేశ్వరుని యశస్సువంటి యశస్సుగల గణపతినగునన్ను కరుణింపుమనునర్థము నిచట గ్రహింపవలయును.

ఇది సవ్యాఖ్యమగు పంచత్రింశ స్తబకము

* * * *

ఓం నమోభగవతే శ్రీరమణాయ శ్రీ భారతీ దేవ్యైనమః

ఉమాసహస్రము

(తొమ్మిదవ శతకము – చతుర్థ స్తబకము.)

షట్ త్రింశస్తబకము

అవ:-ముప్పదియారవదగు నీ స్తబకమునందతి శక్వరీ ప్రసార గతమగు తూణక వృత్తము చేత నిబంధింపఁబడినదియు, రమణీయ శబ్దార్థయు, అగు భగవతీ స్తోత్రగీతి – వెలయుచున్నది.

మూ॥ ఉన్నతస్తనస్థలీ విలోలహారమౌక్తిక
వ్రాతదీధితి ప్రతానబద్ధసౌహృదాసదా।
అన్ధకారి కామినీ దరస్మితద్యుతిర్ధునో
త్వన్ధకారమన్తరఙ్గ వాసినం ఘనం మమ. 1

ఉన్నతమగు స్తనస్థలి యందు (వక్షము నందు) చలించుచున్న కంఠమాలా ముక్తామణి సమూహము యొక్క కాంతి విస్తారముతో స్నేహమొనర్చుచున్న అంధకారిలలనా దరస్మితద్యుతి – అంతఃకరణమునందున్న నాతిమిరమును (అజ్ఞానమును) తొలఁగించుఁగాత!

మూ॥ అమ్బరస్థలే పురాపురన్దరోదదర్శయాం
యాం వదన్తి పర్వతప్రసూతి మైతిహాసికాః।
సా పురా పురామ రేః పురన్ధ్రి కాఖిలామ్బికా
పుత్రకాయమజ్జతే దదాతు దక్షిణం కరమ్. 2